7

సాక్షి చిత్తూరు

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	17
తిరుపతి	34	18
తిరుమల	30	14
గూడూరు	34	19
నగరి	35	19



అంకురార్పణ

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాత్రి సప్తమాతృకలకు అర్చకులు పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ పలికారు.

న్యూస్‌రీల్

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 19న ఆదివారం నిర్వహించనున్నట్లు సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నియమావళి అనుసరించి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

కుష్ఠు రహిత జిల్లాగా మారుద్దాం

– ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి



బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీహరి

చిత్తూరు రూరల్: చిత్తూరును కుష్ఠు రహిత జిల్లాగా మారుద్దామని, ఇందుకు కుష్ఠు లక్షణాలు ఉన్నవారిని తక్షణం గుర్తించి తగిన చికిత్స అందించాలని ఇన్‌చార్జ్ జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, డీఐఓ రవిరాజు అన్నారు. స్పర్శ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం ప్రభుత్వ ఆస్పత్రిలోని లెప్రసీ వార్డులో సోమవారం ఆయన బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు కుష్ఠువ్యాధికి ప్రారంభ లక్షణాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రెడ్డప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అష్టదిక్పాలకులకు ఆహ్వానం పలుకుతూ..

ముక్తిధామం.. మహాతేజం



ధ్వజారోహణానంతరం కర్పూర హారతి సమర్పిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ధ్వజస్తంభానికి పవిత్ర వస్త్రం అలంకరిస్తున్న అర్చకులు, పల్లకిపై భక్త కన్నప్ప

- శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కనులపండువగా కన్నప్ప ధ్వజారోహణం
- నేడు దేవరాత్రికి సర్వం సిద్ధం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)/శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భక్తునికే ప్రథమ పూజ దక్కింది. కన్నప్ప ధ్వజారోహణంతో సోమవారం మహాశివరాత్రి వేడుక మొదలైంది. ముక్కంటి సన్నిధి సకల దేవతలకు కొలువైంది. బోయ వంశస్తులకే ఉభయదారులుగా వ్యవహరించే మహద్భాగ్యం వరించింది. ఆదిదంపతులకు స్వాగతం పలుకుతూ కైలాసగిరిని ఆలయాధికారులు శోభాయమానంగా అలంకరించారు. మేళతాళాల నడుమ భక్త కన్నప్పతో స్వామి, అమ్మవార్లను కొండపైకి వేంచేపు చేశారు. వేదపండితులు ముందుగా ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పవిత్ర వస్త్రంతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుని దేవదేవుని కటాక్షం పొందారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు పాల్గొన్నారు.

నేడు స్వామివారి ధ్వజారోహణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగామంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామివారి ధ్వజారోహణం (దేవరాత్రి) నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఉదయం, సాయంత్రం వెండి అంబారీలపై స్వామి, అమ్మవార్లు ఊరేగనున్నారు.

అష్టదిక్పాలకులకు ఆహ్వానం

కన్నప్ప ధ్వజారోహణానంతరం అష్టదిక్పాలకులను ఆహ్వానించారు. కైలాసగిరిపై ఓ ప్రత్యేక ప్రాంతం నుంచి మంత్రోచ్చారణ నడుమ బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని పిలుపునిచ్చారు.

బతుకు పుల్లకింత

హిందూ ధర్మంలో యజ్ఞయాగాదులకు విశిష్ట స్థానం ఉంది. ముఖ్యంగా శుభకార్యాల్లో హోమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో సమిధలుగా తొమ్మిది రకాల పుల్లలు, గోమయంతో తయారుచేసిన పిడకను వినియోగించడం సంప్రదాయం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ ప్రత్యేక సామగ్రిని సేకరించి పలువురు ఉపాధి పొందుతున్నారు. అత్యంత నియమనిష్టలతో పవిత్ర హోమ సమిధలను సమీకరిస్తున్నారు. యాగ క్రతువులో సమర్పించే విశేష ద్రవ్యాలను విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు.



నవగ్రహ పుల్లలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) హోమం నిర్వహిస్తున్న వేదపండితుడు (ఫైల్)

- హోమ సమిధల సేకరణతో ఉపాధి
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలుచోట్ల విక్రయాలు
- మలేషియాకు సైతం ఎగుమతి

సాక్షి నెట్‌వర్క్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రధానంగా తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురం, తలకోన, నారాయణవనం, నాగలాపురం, బంగారుపాళ్యం, సురుటుపల్లె, గుడిమల్లంలో ప్రముఖ ఆలయాలు కొలువై ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ప్రత్యేక హోమాలు జరిపించుకునేవాళ్లు అధికంగా ఉంటారు. ఈక్రమంలోనే విశేష హోమ పూజల్లో సంప్రదాయంగా వినియోగించే సమిధల విక్రయాలకు కూడా జిల్లా ప్రసిద్ధి చెందింది.

డిమాండ్ అధికం

ఆలయ కుంభాభిషేకాల నుంచి వివాహాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాల్లో ప్రత్యేకంగా హోమాలు జరిపిస్తుంటారు. అందులో మోదుగ, రాగి, తెల్లజిల్లేడు, అత్తి, జమ్మి, ఉత్తరేణి, చంద్ర, గరిక, దర్భలతోపాటు గోవు పేడతో చేసిన పిడకలను సమిధలు సమర్పిస్తుంటారు. మరికొందరు వీటితోపాటు తిప్పతీగ, మర్రి చిగుర్లు, వేప పుల్లలను సైతం వాడుతుంటారు. ఈ సామగ్రికి డిమాండ్ కూడా అధికంగా ఉంది. అయితే ఈ సమిధల సేకరణ కష్టతరంగా మారుతుండడంతో కొందరు అరకొర సామగ్రినే విక్రయించేస్తున్నారు. హోమం విశిష్టత, విధానం తెలిసిన వారు మాత్రం మొత్తం తొమ్మిది రకాల పుల్లలు, పిడక కావాల్సిందే అని పట్టుబడుతుంటారు. ప్రస్తుతం మోదుగ, తెల్ల జిల్లేడు, జమ్మి, చంద్ర పుల్లలు విరివిగా దొరకడం లేదని పలువురు వ్యాపారులు తెలియజేస్తున్నారు. శ్రీకాళహస్తి, చెల్లూరు, కార్వేటినగరం, చంద్రగిరి, పచ్చికాపల్లం, కేవీబీపురం పరిసర ప్రాంతాల్లో మాత్రమే కొద్దోగొప్పో లభిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

సంప్రదాయంతో ఉపాధి!

సంప్రదాయంగా నిర్వహించే హోమాలకు అవసరమైన సామగ్రి అందిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. నగరిలో రవిచంద్రాచ్చారి, తిరుపతిలో మణియాదవ్, శ్రీకాళహస్తి సమీపంలోని చుక్కలనిడిగల్లు, లింగమనాయుడుపల్లె, వీఎంపల్లి, పుల్లూరు, బొక్కసంపాలెం, కాగితాల హరిజనవాడకు చెందిన కొందరు యజ్ఞ సమిధల సేకరించి విక్రయిస్తున్నారు. నగరిలో మాత్రం రవిచంద్రాచ్చారి చిన్న కుటీర పరిశ్రమగా మార్చి మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. అలాగే నగరి పట్టణం ఆదంకాలనీ ఎక్స్‌టెన్షన్ వీధికి చెందిన పలువురు పుల్లల సేకరణను జీవనోపాధిగా మార్చుకున్నారు. వీరంతా హోమానికి అసరమైన వాటిని తీసుకువచ్చి ఎండబెట్టి చిన్న చిన్నవి (జానెడు సైజు)గా కత్తిరించి సిద్ధం చేసుకుంటారు. అనంతరం వాటిని ప్యాకెట్లుగా పార్సిల్ చేసి తమిళనాడులోని వేలూరు, కాంచీపురం, చెన్నై, మధురై, కుంభకోణం తదితర నగరాలకు సరఫరా చేస్తున్నారు. శ్రీకాళహస్తి పరిసర గ్రామాల వారు సేకరిస్తున్న పుల్లలను ఆలయాలకే విక్రయిస్తున్నారు. నగరి నుంచి వెళ్లే హోమ పుల్లలు, ఆవు పిడకలకు మలేషియాలో అధిక డిమాండ్ ఉంది.



తిరుపతి పూల మార్కెట్ వద్ద విక్రయానికి సిద్ధంగా హోమ సమిధలు



తిరుపతి లో యాదవ్ నివాసం వద్ద హోమ పుల్లలు



ప్యాకింగ్‌కు ముందు ఎండబెడుతూ..

సంతృప్తిగా ఉంది



దశాబ్దానికి పైగా ఈ వ్యాపారం చేస్తున్నాం. పదిమందికి ఉపాధి కల్పించడంతో సంతృప్తిగా ఉంది. హోమ పుల్లలకు మంచి డిమాండ్ ఉంది. చెన్నై, వేలూరు, కంచి నుంచి వస్తున్న ఆర్డర్ల మేరకు పుల్లలు సరఫరా చేస్తున్నాం. సమిధల సేకరణ చాలా కష్టం. 20 రోజులపాటు పదిమంది పనిచేస్తే ఒక లోడు సిద్ధం అవుతుంది.

– రవిచంద్రాచ్చారి, నగరి

అగ్ని ఆరాధన ప్రత్యేకం



జీవన విధానంలో 'అగ్ని ఆరాధన' చాలా ప్రత్యేకం. వైదిక పరంపరను అనుసరించి హోమ క్రతువును పలు విధాలుగా ఆచరిస్తున్నారు. హోమాల్లో వాడే సమిధలు విశిష్టమైనవి. తెల్లజిల్లేడును హోమంలో వేయడం వచ్చే పొగ వాతం, కఫం, తలనొప్పి, కోపం, కుష్ఠు, నేత్ర సంబంధిత వ్యాధులను హరిస్తుంది. మోదుగ వల్ల మానసిక సమస్యలు నయమవుతాయి. చంద్ర వల్ల ఎర్రరక్త కణాలు, రక్తహీనత, ఉక్రోషం వంటివి సమసిపోతాయి. ఉత్తరేణి వల్ల చర్మ, జీర్ణ సంబంధిత వ్యాధులు దూరమవుతాయి. రావి వల్ల సంతాన, కఫ దోషాలతో పాటు జ్ఞానం లభిస్తుంది. అత్తి వల్ల వివాహ సమస్యలు, మధుమేహ నుంచి ఉపశమనం లభిస్తుంది. జమ్మి వల్ల అపమృత్యుభయం, అనారోగ్య సమస్యలను తొలగుతుంది. గరిక వల్ల నరదృష్టి నివారణ, సర్పదోషం, చర్మ దోషానికి నివారణ. దర్భ వల్ల కాల సర్ప దోషం, మూర్ఛ రోగం నుంచి ఉపశమనం లభిస్తుంది.

– సాయిరాం పరాంకుశం, అర్చకుడు, తిరుచానూరు

అన్నీ అవసరమే



మా కుటుంబం 20 ఏళ్లుగా హోమం పుల్లలను విక్రయాలు చేస్తోంది. వీటిని నవగ్రహ పుల్లలు అంటారు. హోమానికి ఇవి అన్నీ అవసరమే. మాకు ఆర్డర్లు వస్తాయి. నాకు కాళ్లు లేకపోయినా కూలీల ద్వారా పుల్లలు సేకరించి, కట్ట కట్టి నిల్వ చేస్తాం. వ్యాపారులు వచ్చి తీసుకెళ్తుంటారు. ఒక కట్టలో 28 పుల్లలు ఉంచుతాం. ఒక కట్ట రూ.200. నెల రోజుల పాటు కష్టపడి సేకరిస్తే 50 కట్టలు అవుతాయి.

– మేశం మణియాదవ్, తిరుపతి

వినతులు స్వీకరించి.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చి..

- స్పందనలో కలెక్టర్ హరినారాయణన్
- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- స్పందనకు 194 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు.. వాటిని పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు కలెక్టరేట్ అధికారులు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ స్పందనలో అర్జీలను స్వీకరించారు. వాటిని నిర్ణీత గడువులోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాధాన్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి 194 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 127, డీఆర్‌డీఏ 2, హౌసింగ్ శాఖ 11, వైద్య, ఆరోగ్య శాఖ 2, నగర పాలక సంస్థ 2, డ్వామా 2, పోలీసు శాఖ 2, జిల్లా అటవీ శాఖ 1, ఎక్సైజ్ శాఖ 3, దేవదాయ శాఖ–1, ఏడీసీసీబీ–సీఈఓ 1, ఇతరులు 40 అర్జీలు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

సమస్యలు ఇవీ..

తమ గ్రామానికి వెళ్లే మార్గంలో నూతనంగా తారు రోడ్డు వేయాలని బంగారుపాళ్యం మండలం కేఎంకండ్రిగ గ్రామస్తులు కోరారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. 108 అంబులెన్స్, గ్యాస్ సిలిండర్ వాహనాలు గ్రామంలోకి రావడం లేదన్నారు. తమ సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే దారి ఆక్రమణ సమస్యను పరిష్కరించాలని పూతలపట్టు గ్రామస్తులు విన్నవించారు. పూతలపట్టు మండల కేంద్రం నుంచి కాణిపాకం వైపు వెళ్లే రోడ్డు పక్కనున్న నడకదారిని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



స్పందన అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన ప్రజలు

ఎన్నికల ఏర్పాట్లలో బిజీ..బిజీ..

చిత్తూరు కలెక్టరేట్: తూర్పు రాయలసీమ (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల) గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించడంతో ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరిస్తామని అధికార యంత్రాంగం చెబుతోంది. మార్చి 13న ఎన్నికలు, 16న కౌంటింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరినారాయణన్, స్థానిక సంస్థల ఆర్వో జేసీ వెంకటేశ్వర్ జిల్లాకేంద్రంలో పలు కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

పకడ్బందీగా పర్యవేక్షణ..

ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బంది కేటాయింపుపై కలెక్టర్, జేసీల సమక్షంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. గ్రాడ్యుయేట్, టీచర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ చేసే రోజు నుంచి ఈ నెల 23 వరకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల నుంచి పోటీ చేసే అభ్యర్థులు చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్‌లు దాఖలు చేయాలి. గ్రాడ్యుయేట్, టీచర్ నామినేషన్‌లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ చాంబర్‌లో, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లను కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆర్వోగా వ్యవహరించే జేసీ వెంకటేశ్వర్ స్వీకరిస్తారు. సోమవారం సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ రూట్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ ఉత్తర్వులు జారీచేశారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

క్లుప్తంగా

మంటల్లో వ్యక్తి సజీవదహనం


సంఘటనా స్థలంలో పోలీసులు


వెంకటప్ప (ఫైల్)

సదుం: ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గొడ్లవారిపల్లెకు చెందిన వెంకటప్ప(60) సదుంలో షామియానా షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఆయన రంగనాథమిట్ట సమీపంలో ఉన్న తన మామిడితోటలో మోటారు అమర్చేందుకు వెళ్లాడు. అయితే తోటకు ఉన్న కంచెకు నిప్పు అంటుకోవడంతో ఆర్పే ప్రయత్నం చేస్తూ, అక్కడ ఉన్న పశువులకాపరి సుబ్రమణ్యంను పిలిచాడు. అతను వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చే చూసే లోపు మంటల్లో పడి కాలిపోయాడు. మృతుడికి బీపీ సమస్య ఉందని, ఆర్పే ప్రయత్నంలో అందులో పడి మృతి చెంది ఉంటాడని వారు భావిస్తున్నారు. ఎస్ఐ మారుతి సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పీలేరుకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కల్యాణ వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయ మర్యాదలను అందుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్

నారాయణవనం/వడమాలపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం నారాయణవనంలోని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనను ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి, పద్మావతీ అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి రవిబాబు, పుత్తూరు జడ్జి వేణుగోపాల్ స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం రాత్రి వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

అధిక ధరకు కల్యాణోత్సవం టికెట్ల విక్రయం

- తిరుమలలో దళారీపై కేసు నమోదు

తిరుమల : శ్రీవారి కల్యాణోత్సవం టికెట్లను అధిక ధరకు విక్రయించిన దళారీపై తిరుమల టూటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. శ్రీవారి కల్యాణోత్సవం టికెట్లు ఇప్పించాలని బెంగళూరుకు చెందిన పవన్ కుమార్ తిరుపతికి చెందిన దళారి డి.సురేష్‌ను సంప్రదించాడు. సురేష్ తనకు తెలిసిన టీటీడీ ఉద్యోగి టీవీ నాగభూషణం సిఫారసు లేఖ ద్వారా రెండు కల్యాణోత్సవం టికెట్లు పొందాడు. వాటిని భక్తులకు రూ.28,500కు విక్రయించాడు. తాము మోసపోయామని గుర్తించిన భక్తులు టీటీడీ విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో ఎస్.పద్మనాభన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన భక్తులతో తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సంప్రదాయ శిల్పకళాపోషణకు కృషి


శిల్పకళాశాలలో ప్రదర్శనలను పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి తదితరులు

- టీటీడీ శిల్పకళాశాలలో మూడు రోజుల శిల్పకళా ప్రదర్శన
- అమ్మకాలను ప్రారంభించిన ఈఓ ఏవీ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి: శిల్పకళ, సంప్రదాయ సంగీత, నృత్య కళలను పోషించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం కృషిచేస్తోందని ఈఓ ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. టీటీడీ శిల్ప కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే శిల్పకళా ప్రదర్శన, అమ్మకాలను సోమవారం ఆయన ప్రారంభించారు. శిల్పకళాశాల విద్యార్థులు తయారుచేసిన ఆలయ నిర్మాణం, శిల్ప, సుధా, దారు, లోహ శిల్పాలు, సంప్రదాయ వర్ణ చిత్రాలు, కలంకారీ చిత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఈఓ మాట్లాడుతూ టీటీడీ అనేక హిందూ ధార్మిక కార్యక్రమాలతో పాటు, సాంఘిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా 30కి పైగా పాఠశాలలు, ఆస్పత్రులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిల్పకళలో నైపుణ్యం సంపాదించిన వారికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. టీటీడీ శిల్పకళాశాల నుంచి వెళ్లిన అనేక మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో మంచిస్థాయిలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులు శిల్పకళలో ప్రావీణ్యం సాధించి, శిల్పకళను బతికించాలని పిలుపునిచ్చారు. శిల్ప కళాశాలలో కలంకారీ కోర్సులో చేరే విద్యార్థులకు కూడా అడ్మిషన్ సమయంలో రూ.లక్ష డిపాజిట్ చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. శిల్ప కళాశాల నిర్వహణ, పరిసరాల వాతావరణం చక్కగా ఉందని అధ్యాపకులను, విద్యార్థులను ఆయన అభినందిచారు. జేఈఓ సదాభార్గవి, డీఈఓ భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డితో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఈనెల 15వ తేదీ వరకు రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిల్ప కళా ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయి.

కారు-బైక్ ఢీ : వృద్ధురాలి మృతి


మృతి చెందిన రాజమ్మ

బంగారుపాళెం: మండలంలోని కేజీ సత్రం వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. చిత్తూరు రూరల్ మండలం పోతంబట్టు గ్రామానికి చెందిన చెంగల్‌రెడ్డి భార్య రాజమ్మ, మనవడు భరత్‌తో కలసి ద్విచక్రవాహనంపై తవణంపల్లె మండలం ముట్టుకూరులో బంధువుల ఇంటికి వెళ్తోంది. మార్గమధ్యలో కేజీ సత్రం వద్ద ద్విచక్రవాహనానికి పెట్రోల్ అయిపోయింది. దీంతో పెట్రోల్ బంక్ దగ్గరకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా పలమనేరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో భరత్, రాజమ్మ, తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజమ్మ(78) పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి..


మృతి చెందిన కృష్ణ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీ దిన్నెపాటి దళితవాడ సమీపంలో సోమవారం ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి మిట్టమీదరాచపల్లె ఎస్టీ కాలనీకి చెందిన గడ్డం కృష్ణ(42) మృతి చెందినట్లు కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఓ రైతుతోటలోని మామిడి చెట్లకు మందు పిచికారీ చేయడానికి నలుగురు కూలీలు ట్యాంకరుపై కూర్చుని వెళ్తున్నారు. ట్రాక్టర్ దిన్నెపాటి దళితవాడ సమీపంలోని మలుపు వద్ద కొక్కి తెగిపోవడంతో అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడింది. దీంతో కృష్ణ ట్రాలీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహసారథిపై మేనల్లుడు దాడి


గాయపడిన కృష్ణయ్య

చౌడేపల్లె: మండంలోని చారాల ఎస్సీ కాలనీకి చెందిన గృహసారథి జి.కృష్ణయ్యపై అతని మేనల్లుడు రెడ్డిమోహన్ దాడికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. కృష్ణయ్య తమ్ముడు చంద్రప్ప గతంలో పాముకాటుకు గురయ్యాడు. ఆస్పత్రి ఖర్చుల కోసం చంద్రప్ప తల్లి వెంకటమ్మ బంగారు నగలను అతని కుమారులు కుదువ పెట్టారు. ఈ విషయం తెలిసి వెంకటమ్మ కుమార్తె నారాయణమ్మ, సోదరుడు చంద్రప్ప కుటుంబీకులను దుర్భాషలాడింది. రెండు రోజుల క్రితం చంద్రప్పపై నారాయణమ్మ కొడుకు రెడ్డిమోహన్ దాడికి పాల్పడ్డాడు. దీంతో అతను సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడిపైన పోలీసులకు ఫిర్యాదు చేశారని నారాయణమ్మ మరోమారు చంద్రప్పతో గొడవకు దిగింది. అక్కడే ఉన్న కృష్ణప్ప ఇద్దరినీ వారించాడు. ఆ సమయంలో కోపోద్రిక్తుడైన రెడ్డిమోహన్ ఇనుపరాడ్డుతో కృష్ణప్పపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా రెడ్డిమోహన్ గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి ప్రధాన అనుచరుడు. సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, మాజీ సర్పంచ్ గోవిందయ్య ఆస్పత్రికి వెళ్లి కృష్ణయ్యను పరామర్శించారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి పకడ్బందీ చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రుణం తీర్చిన వారికి రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్టేజీ కన్వర్షన్, ఇళ్ల నిర్మాణాల పూర్తి, పురోగతిలో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లాలో 22,229 ఇళ్లు పూర్తయ్యాయని, వివిధ దశల్లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేసేలా రుణాలను ఇవ్వాలన్నారు. బీఎల్ స్థాయిలో 17,700, ఆర్‌సీ స్థాయిలో 9,556, ఆర్‌ఎల్ స్థాయిలో 7,800 ఉన్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ వెంకటేశ్వర్, హౌసింగ్ పీడీ పద్మనాభం, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ జగదీష్

చిత్తూరు అర్బన్: స్పందన ద్వారా వచ్చే ప్రజా సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ జగదీష్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 17 ఫిర్యాదులు రాగా అందులో చీటింగ్ 2, వేధింపులు 7, ఆస్తి తగాదాలు 8 చొప్పున వచ్చాయి. వాటిని విచారించి నిర్ణీత సమయంలో బాధితులకు న్యాయం చేయాలని ఆయన ఆదేశించారు.

దూసుకొచ్చిన కారు : 5 బైకులు ధ్వంసం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


ప్రమాదంలో ధ్వంసమైన ద్విచక్రవాహనాలు

శ్రీరంగరాజపురం : జాతీయ రహదారిపై కారు వేగంగా దూసుకురావడంతో ఐదు ద్విచక్రవాహనాలు ధ్వంసమైన సంఘటన శ్రీరంగరాజపురం మండలం పోలీస్‌స్టేషన్ ఎదుట చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. చెన్నైకి చెందిన గోపాల్‌నాయుడు కొత్తకారు కొనుగోలు చేసి, కాణిపాకంలో పూజ చేయించడానికి చెన్నై నుంచి సోమవారం ఉదయం బయలుదేరాడు. అయితే ఎస్సార్‌పురం పోలీస్ స్టేషన్‌కు సమీపంలోకి రాగానే అతను నిద్రలోకి జారుకోవడంతో కారు అదుపు తప్పి రోడ్డుపై నిలిచిన ఉన్న 5 ద్విచక్రవాహనాలను ఢీకొంది. అనంతరం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అయితే గోపాల్‌నాయుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రాణనష్టం ఏమీ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో ప్రీమియం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


పీవీఎస్ బాబు, తిరుపతి జిల్లా రిజిస్ట్రార్

తిరుపతి అర్బన్: ఆస్తుల క్రయవిక్రయదారులు సులభంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడంతోపాటు కార్యాలయంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి జిల్లా కేంద్రంలో ప్రీమియం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఏరోజు రిజిస్ట్రేషన్ చేసుకుంటే అదేరోజు డాక్యుమెంట్లు క్రయవిక్రయదారులకు అందజేస్తారని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయని తెలిపారు. తిరుపతిలోని తుడా కార్యాలయం ఎదురుగా ఉన్న పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. అదనంగా తిరుపతి కేంద్రంలోనే మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కొత్త కార్యాలయానికి 7వేల నుంచి 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో పాటు విశాలమైన పార్కింగ్ స్థలం ఉన్న భవనం అద్దెకు తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు 9949940593 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓగా శ్రీహరి

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓగా శ్రీహరిని నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న ప్రకాశం సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో తిరుపతి డీఎంఅండ్‌హెచ్‌ఓ రెండు రోజుల పాటు చిత్తూరుకు డీఎంఅండ్‌హెచ్‌ఓ బాధ్యతలను అప్పగించింది.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో భవిత ప్రతిభ


జూడో పోటీల్లో వెండి పతకం అందుకుంటున్న భవిత

వడమాలపేట : రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో వడమాలపేట బాలుర పాఠశాల 8వ తరగతి విద్యార్థిని భవిత వెండిపతకం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం భువనేశ్వరి తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో కృష్ణా జిల్లా విజయవాడలోని మాంటిస్సోరి ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్-జూనియర్ జూడో పోటీల్లో పి.భవిత 36 కేజీల విభాగంలో ఫైనల్‌లో రెండోస్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థినికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రాజును, భవితను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.